సాక్షి ఒడిశా

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 3,84,180

బంగారం : 1 గ్రాము 100 మిల్లీ గ్రాములు

వెండి : 21 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



స్వాతంత్ర్య వేడుకలు..

జయపురం సబ్ డివిజన్‌లో స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అధికారులు సిద్ధమవుతున్నారు. - 8లో.



ఘనంగా వార్షికోత్సవం

సఖి సెంటర్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - 8లో.

75 లక్షల మొక్కలు నాటుతాం: సీఎం



ముఖ్యమంత్రి అధ్యక్షతన లోక్ సేవా భవన్‌లో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం సన్నద్ధత సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం రెండో విడత కింద 75 లక్షల మొక్కలను నాటనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన మంత్రి చేసిన కృషికి కృతజ్ఞతగా ప్రధాన మంత్రికి జన్మ దిన కానుకగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది జూన్ 5 నుంచి సెప్టెంబర్ 30 వరకు ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం రెండో విడత రాష్ట్రం అంతటా 7.5 కోట్ల చెట్లను నాటడం లక్ష్యంగా పెట్టుకుంది. సెప్టెంబర్ 17న రికార్డు స్థాయిలో ఒకే రోజున 75 లక్షల మొక్కలను నాటాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హరిత కానుకగా ఈ కార్యక్రమం చేపడుతున్నారు. అటవీ, వ్యవసాయ శాఖలు ఈ కార్యక్రమానికి సారథ్యం వహిస్తాయి. ఇతర ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, స్వయం సహాయక సంఘాలు, ప్రజారోగ్య సంస్థలు మరియు యువజన సంఘాలు మద్దతుగా పాల్గొంటాయి. స్థానిక వాతావరణం, మట్టి సారం ఆధారంగా సిఫార్సు చేసిన వేప, రావి, మర్రి, ఉసిరి, పనస వంటి పలు జాతుల మొక్కలు నాటుతారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం



నిందితుడు లక్ష్మీనారాయణ పాత్రో

పర్లాకిమిడి: దుబాయి, అరబ్ ఎమిరేట్స్‌లో ఉద్యోగాలు కల్పిస్తానని లక్షలాది రూపాయలు కాజేసిన మెళియాపుట్టి మండలం రట్టిణి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పాత్రోను బుధవారం రాత్రి ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆదర్శపోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత భూపతి అందజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని సరిహద్దులోగల మెళియాపుట్టి మండలం రట్టిణి గ్రామానికిచెందిన లక్ష్మీనారాయణ పాత్రో కొంతకాలంలో విదేశాల్లో ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.2లక్షల నుంచి రూ.రెండున్నర లక్షల వరకు తీసుకున్నాడని గుసాని సమితికి చెందిన అమర గ్రామస్తులు ఆరోపించారు. ఈ క్రమంలో బుధవారం లక్ష్మీనారాయణ పాత్రో కొందరి వద్ద ఉద్యోగాల పేరిట డబ్బులు సేకరిస్తుండగా.. కొందరు యువకులు పర్లాకిమిడిలో ఫలానా స్థలం వద్దకు రావాలని కోరారు. సరిగ్గా పోలీసు స్టేషన్ జంక్షన్ వద్దకు వచ్చిన తర్వాత ఐఐసీ ప్రశాంత్ భూపతికి పాత్రోను అప్పగించారు. గజపతి జిల్లాలోనే కాకుండా పలాస మండలంలోని పెద్దవీధి గ్రామానికి చెందిన కొన్ని జోగారావు, గుసాని సమితి డాలింబాపూర్ గ్రామానికి చెందిన రెల్ల భీమారావు, ముంబై, విశాఖపట్నం తదితరుల వద్ద నుంచి కూడా ఇలాగే డబ్బులు కాజేశాడని ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు. లక్ష్మీనారాయణకు వ్యతిరేకంగా ఎనిమిది ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. నిందితుడికి ముంబై, కాశ్మీర్ వరకూ ఏజెంట్లు ఉన్నట్టు పోలీసు అధికారుల దర్యాప్తులో తేలింది. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో దాదాపు రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. ప్రస్తుతం లక్ష్మీనారాయణ పాత్రో పాస్‌పోర్టు, బ్యాంకు అకౌంట్‌ను నిలిపి వేసినట్టు అభ్యర్థులులు తెలిపారు. దీనిపై పూర్తి దర్యాప్తు చేపడుతున్నట్టు ఆదర్శపోలీసు స్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు.

న్యూస్‌రీల్

పెట్రోల్ బంక్ ఉద్యోగిపై దుండగుల దాడి



తీవ్రంగా గాయపడిన రాజేంద్ర ఖిలో

జయపురం: ఒక పెట్రోలు బంక్‌లో పని చేస్తున్న ఉద్యోగిపై దుండగులు దాడిచేసి గొంతు కోసిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో, అక్కడ నుంచి కొరాపుట్ సాహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు జయపురం సమితి పల్లిగుడ గ్రామానికి చెందిన రాజేంద్ర ఖిలోగా సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. రాజేంద్రపై దుండగుల దాడికి గల కారణాలు తెలియలేదు. సదర్ పోలీసు అధికారి వివరణ ప్రకారం జయపురం సమితి పాత్రోపుట్‌లోని పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్న రాజేంద్ర ఖిలో బుధవారం సాయంత్రం బంక్‌లో ఉన్నాడు. అయితే అకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు వచ్చి అతడిపై దాడి జరిపి అతడి గొంతుపై కత్తితో కోసి వెంటనే పరారయ్యారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. రక్తశిక్తమై పడి ఉన్న అతడిని వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి అక్కడ నుంచి కొరాపుట్‌కు తరలించినట్లు వెల్లడించారు.

చెరువులో వృద్ధుని మృతదేహం



వృద్ధుని మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని చంచాడగుడ గ్రామ సమీపంలో గల ఒక చెరువులో వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చంచాడగుడ గ్రామంలో కొందరు ఎప్పటిలాగే గురువారం నాడు స్నానానికి వెళ్లగా చెరువులో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బోల్తాపడిన వ్యాన్



బోల్తాపడిన వ్యాన్

రాయగడ: పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని కొత్తూరు నుంచి జిల్లాలో గుణుపూర్‌కు వస్తున్న ఒక వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. గుణుపూర్ సమీపంలోని శిరిజోల వద్ద ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కొత్తూరు నుంచి వస్తున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న ఒక బైకును తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్, హెల్పర్లు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పునరావాస కేంద్రానికి తరలింపు



ప్రత్యేక వాహనంలో పార్వతిని తరలిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని కొలనారలో మానసిక దివ్యాంగురాలు అలజింగి పార్వతిని జిల్లా సామాజిక భద్రతా అధికారి శ్రీకాంత్ కుమార్ పాణిగ్రహి, కొలనార సమితి సామాజిక భద్రత అధికారి ప్రభాత్ కుమార్ సోబొరొలు మల్కన్‌గిరిలోని మానసిక రోగుల భద్రతా కేంద్రానికి గురువారం తరలించారు. కొలనార ప్రాంతంలో ఆమె గత కొన్ని రోజులుగా రోడ్డుపై వెళ్తున్న వారిపై ఆకస్మికంగా దాడిచేసి గాయపరుస్తుండేది. దీంతో కొలనార జిల్లా పరిషత్ సభ్యుడు ఎ.ధవళేశ్వర్ నాయుడు తదితరులు ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేస్తూ కొలనార బీడీవోకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం ఈ మేరకు ఆమెకు స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స అందించిన అనంతరం, మల్కన్‌గిరిలోని మానసిక రోగుల భద్రత కేంద్రానికి ప్రత్యేక వాహనంలో తరలించారు.

ప్రైవేట్ బస్సు టికెట్ కౌంటర్ ఏర్పాటుపై వివాదం



పత్రికా ప్రతినిధుల సమావేశంలో కార్యదర్శి మహంతి

జయపురం: జయపురం ప్రైవేట్ బస్సు టికెట్ కౌంటర్ ఏర్పాటుపై వివాదం తలెత్తింది. ప్రైవేటు బస్టాండ్ ఆవరణలో టికెట్ కౌంటర్ ఏర్పాటుపై కొందరు అభ్యంతరాలు తెలపడంతో వివాదం తలెత్తింది. ఈ సమస్యపై ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సలహాదారులు బుధవారం సంఘ కార్యాలయంలో పత్రికా ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ టిక్కెట్ కౌంటర్ వివాదం జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముందు పరిష్కారం అవుతుందన్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసమే టికెట్ కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయాన్ని కొందరు రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రైవేట్ బస్సు యాజమాన్య సంఘం అధ్యక్షుడు బాలా పాత్ర, న్యాయ సలహాదారు సుకాంత అధికారి, బస్సు యజమానులు పవిత్ర పాత్రో, బన త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.

• ఎట్టకేలకు మరమ్మతులు



ఖంజావీధి వద్ద మరమ్మతులు చేయిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

పర్లాకిమిడి: గంతలతో నిండిన పర్లాకిమిడి టౌన్ రోడ్డును ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపడుతున్నారు. జూన్‌లో బీజేపీ శ్రేణులు (ఆర్‌అండ్‌బీ) శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు అభిషేక్ శెఠిని నిలదీశారు. ప్రస్తుతం ఫారెస్టు గేటు నుంచి కోర్టు జంక్షన్ వరకు మరమ్మతులు చేపడుతున్నారు. ఎప్పుడు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం జరుగుతుందో అని ప్రజలు అంటున్నారు.

గ్రామతరంగ్ తొలిదశలో 180 మందికి శిక్షణ



గ్రామతరంగ్ అధికారి రంజన్ త్రిపాఠి మరియు జిల్లా ఉపాధి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠిల మధ్య అవగాహన ఒప్పందం

పర్లాకిమిడి: జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన శాఖ, సెంచూరియన్ వర్సిటీ అనుబంధ సంస్థ గ్రామతరంగ్ శిక్షణ నిమిత్తం గురువారం కలెక్టరేట్‌లో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు గ్రామ్‌తరంగ్ రాష్ట్ర ముఖ్యులు రంజన్ త్రిపాఠి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సౌభాగ్య స్మృతి రంజన్ త్రిపాఠి ల మధ్య ఒప్పందం సంతకాలు చేశారు. రాష్ట్రంలో తొలి దశలో 180 మంది టెన్త్, ఐటీఐ, ప్లస్ 2 విద్యార్థులకు ఉచితంగా భోజన సదుపాయాలు కల్పించి ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్, హ్యాండ్ హెల్డ్ డివైస్ ట్రేడ్‌లో శిక్షణ అందించి ఉపాధి కల్పిస్తామని జిల్లా ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్ మెంట్ అధికారి సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు శిక్షణ కోసం 9827946884 నంబరుకు సంప్రదించగలరని త్రిపాఠి తెలియజేశారు.

కొట్‌పాడ్ కమ్యూనిటీ హెల్త్ కేంద్రంలో ఆల్ట్రా సౌండ్ ప్రారంభోత్సవం



కొట్‌పాడ్ ఆస్పత్రిలో ఆల్ట్రాసౌండ్ మిషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపు భొత్ర

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఆల్ట్రాసౌండ్ యంత్రాన్ని కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర గురువారం ప్రారంభోత్సవం చేశారు. అలాగే ఆస్పత్రిలో రోగుల కోసం రక్షిత తాగునీటి పథకాన్ని కూడా ప్రారంభించారు. కొట్‌పాడ్ కమ్యూనిటీ హాస్పిటల్ అధికారి డాక్టర్ సారదా ప్రశాద ముని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆల్ట్రాసౌండ్ యంత్రం ఏర్పాటు వల్ల కొట్‌పాడ్ సమితి, పట్టణ ప్రజలు, ముఖ్యంగా గర్భిణులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి గురువారం వైద్య నిపుణులు వచ్చి కొట్‌పాడ్ ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

లక్ష్మీనృసింహునికి శ్రావణ మాస పూజలు



నృసింహునికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



సుదర్శనుడికి హారతి

రాయగడ: కొలనార సమితి పరిధిలో గల అమలా భట్ట సమీపంలో ఉన్న శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో కొలువై ఉన్న లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలను గురువారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు స్వామికి నిర్వహించారు. అదేవిధంగా సకల కార్యాలు జయం చేసే శ్రీసుదర్శన ఆల్వార్ తిరునక్షత్రం సందర్భంగా సుదర్శనుడికి విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం స్వామికి అష్టోత్తర శతనామ అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ దంపతులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

బీజేపీలోకి చేరికలు



బీజేపీలో చేరినవారితో ఎమ్మెల్యే నర్సంగ్ మద్కమి

మల్కన్‌గిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో మల్లవారం పంచాయతీకి చెందిన బీజేడీ కార్యకర్తలు బీజేపీలో గురువారం చేరారు. మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మాడ్కమి వీరికి పార్టీ కండువలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో నారాయణ్ విశ్వాస్, శ్రీమంత్ హల్దర్, ముకా మడ్కామి, బిమా మాడ్కమి, కునా మిస్రీలు ఉన్నారు. పంచాయతీ అభివృద్ధి కోసం బీజేపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలియజేశారు.

'తప్పుడు వార్తలు రాస్తున్నారు'



పత్రికా ప్రతినిధుల సమావేశంలో వివరిస్తున్న రంజితా నాయిక్

జయపురం: మీడియా ప్రతినిధులు తనపై తప్పుడు వార్తలు రాస్తున్నారని బొరిగుమ్మ అటవీ విభాగ మహిళా ఫారెస్టర్ రంజిత కుమారి నాయక్ ఆరోపించారు. స్థానిక ఒక హొటల్‌లో ఆమె మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు రాసిన వార్తపై రేంజర్ దర్యాప్తు జరిపారని, ఆ సమయంలో గ్రామ ప్రజలు వార్డు మెంబర్, సర్పంచ్ నాయిక సర్పంచ్ అభిప్రాయాలను సేకరించారని తెలిపారు. కలప దొంగతనం జరిగిందని చూపిస్తున్న వీడియో దాదాపు ఆరేళ్ల కిందటిదని తెలిపారు. జర్నలిస్టులు బిజయ పంగి, ఇంద్ర పంగిలు ఈ వీడియోతో తనను బ్లాక్ మెయిల్‌చేశారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ ఇద్దరు జర్నలిస్టులు తనను మానసిక వేదనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

ఆకార్‌పల్లిలో అధికారుల పర్యటన



ఆకర్‌పల్లిలో పర్యటిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఆకార్‌పల్లి పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా పాడైంది. సుమారు 120 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పలు పత్రికల్లో వార్తలు రావడంతో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి గురువారం స్పందించారు. కలిమెల సమితి అధికారి తపాన్ కుమార్ సేనాపతితో చర్చించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బీడీఓ, పీఈఓ కలిసి ఆకార్‌పల్లి పంచాయతీలో పర్యటించారు. అక్కడి సమస్యలపై సర్పంచ్ సత్యసరణ్ పాల్‌తో చర్చించారు. గ్రామాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేసి రూ.6 లక్షల నిధులు మంజూరు చేశారు. తొలుత రహదారిని నిర్మించాలని ఎమ్మెల్యే నర్సింగ్ ఆదేశించారు.

పూరీ తొక్కిసలాట దర్యాప్తు నివేదిక దాఖలు



ముఖ్యమంత్రికి తొక్కిసలాట నివేదిక దాఖలు చేసిన అభివృద్ధి కమిషనర్



తొక్కిసలాట నివేదిక పరిశీలనలో ముఖ్యమంత్రి

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని రథ యాత్ర సందర్భంగా గుండిచా మందిరం ప్రాంగణం శారదా బాలిలో విచారకర తొక్కిసలాట సంఘటన జరిగిన విషయం విదితమే. ఈ సంఘటనపై అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ గురువారం లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి దర్యాప్తు నివేదిక సమర్పించారు. దర్యాప్తు నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం చర్యల పట్ల అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ ఏడాది జూన్ 29 తెల్లవారుజామున శారదా బాలిలో తొక్కిసలాట జరిగింది. ఈ దురదృష్టకర సంఘటనలో మొత్తం 3 మంది భక్తులు మరణించారు. చాలా మంది భక్తులు గాయపడ్డారు. దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. అభివృద్ధి కమిషనర్ ఆధ్వర్యంలో దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన కమిటీలో 4 మంది ఓఏఎస్ అధికారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానస్ రంజన్ సామల్, బినయ్ కుమార్ దాస్, రష్మి రంజన్ నాయక్ మరియు ప్రదీప్ కుమార్ సాహులను దర్యాప్తు బృందంలో చేర్చింది.

కొబ్బరితో విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు



ముహూర్తపు రాట కార్యక్రమంలో యువకులు

రాయగడ: స్థానిక బుదరావలసలో ప్రతీ ఏడాది మాదిరిగా ఈసారి కూడా వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మూడేళ్లుగా ఇక్కడ బుదరావలస యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోనే అత్యంత పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ గుర్తింపు పొందుతున్నారు. అయితే ఈ ఏడాది వినూత్నంగా వినాయక విగ్రహం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం ముహూర్తపు రాటను వేశారు. సుమారు 2001 కొబ్బరికాయలతో 25 అడుగుల వినాయక విగ్రహాన్ని రూపొందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పాత దేవాలయాలపై దృష్టి: న్యాయ శాఖ మంత్రి



న్యాయ శాఖ మంత్రి అధ్యక్షతన దేవదాయ అధికారుల సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లో ఆచారబద్ధంగా నిత్య, దైనందిన పూజాదుల నిర్వహణ, పరిరక్షణ పటిష్టంగా కొనసాగించాలని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ అధికారులకు ఆదేశించారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్ సేవా భవన్ సముదాయంలో న్యాయ శాఖ సమావేశం గదిలో గురువారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. దేవాలయాల క్రమబద్ధమైన ఆచారాలు, పాత దేవాలయాల మెరుగుదల, సంరక్షణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు వివిధ ప్రాంతాలను సందర్శించి రాష్ట్రంలోని పాత దేవాలయాల స్థితి గురించి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దేవాదాయ కమిషన్ వెబ్‌సైట్ ఆధునికీకరణ చేపట్టి పూర్తి వివరాలతో అవసరమైన సమాచారాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవాలని ప్రతిపాదించారు. దేవదాయ, ప్రైవేట్ యాజమాన్యంలోని దేవాలయాల్లో నిత్య, దైనందిన, వార్షిక ఉత్సవాదుల క్రమబద్ధీకరణ, ఆలయ నిర్వహణకు ప్రత్యేక గ్రాంట్లు, సర్టిఫికెట్ల మంజూరు, ట్రస్ట్ బోర్డు విధులు, బాధ్యతలపై అధికార వర్గాలు నిరంతరం పరిశీలిస్తారు. ఓహెచ్‌ఆర్‌ఈ చట్టం 1951 నిబంధనల ప్రకారం హిందూ మత సంస్థల ఉత్తమ నిర్వహణ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విధులు, ప్రభుత్వ పనులను త్వరితంగా నిర్వహించడానికి కొత్త నియామకాలు వంటి అంశాలు చర్చించారు. ఈ క్రమంలో సుపరిపాలన, పారదర్శకత, డిజిటల్ పురోగతికి ప్రాధాన్యతనిస్తూ అన్ని పనులను సకాలంలో నిర్వహించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం అన్ని మత సంస్థల అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయడానికి అందరూ కలిసి పనిచేయాలని శాఖా అధికారులకు సూచించారు. సమావేశంలో, న్యాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మానస్ రంజన్ బారిక్, దేవాదాయ శాఖ కమిషనర్ లలాటేందు జెనా, ప్రత్యేక కార్యదర్శి ప్రణబ్ కుమార్ పాత్రో, అదనపు కార్యదర్శి శివ ప్రసాద్ మహాపాత్రో, భగవాన్ ప్రసాద్ సాహు, దేవాదాయ శాఖ పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి


సింహాచలం మృతదేహం

పొందూరు: పొందూరు పంచాయతీ పరిధిలోని జోగన్నపేట వద్ద బుధవారం రాత్రి ఆటో ఢీకొని అదే గ్రామానికి చెందిన టొంపల సింహాచలం (80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పొందూరు నుంచి దేవరవలస వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలంలోనే వృద్ధుడు మృతి చెందాడు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సింహాచలంకు ఓ కుమార్తె ఉంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


తలకొరివి పెట్టిన కుమార్తె

సరుబుజ్జిలి: పాతపాడు గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు టంకాల చినఅప్పలనాయుడు గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయనకు కుమారులు లేరు. ముగ్గురూ కుమార్తెలే. దీంతో పెద్దకుమార్తె విజయలక్ష్మి అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి చితికి నిప్పంటించి రుణం తీర్చుకున్నారు.

వైఎస్సార్ సీపీ సర్పంచ్ మృతికి సంతాపం


కిల్లి సావిత్రి (ఫైల్)


టెక్కలి: తలగాం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కిల్లి సావిత్రి గురువారం మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌సీపీ తరఫున రెండు సార్లు సర్పంచ్‌గా సేవలు అందజేశారు. ఈయన సోదరుడు వెంకటేశ్వర్రావు ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలు అందజేస్తున్నారు. సావిత్రి మృతి పట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జెడ్పీటీసీ దువ్వాడ వాణి, ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిషోర్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

తీర ప్రాంత భద్రతకు పక్కా చర్యలు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో తీర ప్రాంతాలైన బారువ, కళింగపట్నం, భావనపాడు తదితర తీర ప్రాంతాల భద్రతకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. సముద్రంలో పని చేసే ప్రతి మత్స్యకారుడు భద్రతతో కూడిన లైఫ్ జాకెట్ విధిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని, 40 శాతం సబ్సిడీతో లభించే లాబ్ జాకెట్లను 60 శాతం లబ్ధిదారు భరించాల్సి ఉన్నప్పటికీ అందులో 30 శాతం కలెక్టర్ నిధుల నుంచి సమకూరుస్తామని, మిగిలిన 30 శాతం కూడా సీఎస్ఆర్ నిధుల నుంచి అందించే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అయితే లైఫ్ జాకెట్ల పంపిణీ అనంతరం లైఫ్ జాకెట్ లేకుండా ఏ ఒక్కరు సముద్రంలోకి వెళ్లరాదని సూచించారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తీర ప్రాంత మెరైన్ పోలీస్ స్టేషన్‌లకు బయో ఫెన్సింగ్ విధానంలో కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా తీర ప్రాంతాలలో వాచ్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

బీసీ హాస్టల్లో మౌలిక సదుపాయాలపై ఆరా


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దష్టికి తీసుకురావాలని సూచించారు. శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది కె.ఇందిరా ప్రసాద్, సంఘ సేవకులు పాల్గొన్నారు.

ఘనంగా సఖీ వన్‌స్టాప్ సెంటర్ వార్షికోత్సవం

పర్లాకిమిడి: స్థానిక టౌన్ హాల్‌లో గురువారం సాయంత్రం వన్ స్టాప్ సెంటర్ (సఖీ), ఐ.ఎస్.ఆర్.డి 6వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో సబ్ కలెక్టర్ అనుప్‌పండా, ఐ.ఎస్.ఆర్.డి డైరెక్టర్ సుధీర్ సాబత్, ప్రోగ్రాం ఆఫీసర్ సరలా పాత్రో, జిల్లా సాంస్కృతిక అధికారిని అర్చనా మంగరాజ్, డి.సి.పి.యు అరుణ్ కుమార్ త్రిపాఠి, సి.డబ్ల్యూ.సి చైర్మన్ అశ్వినీ కుమార్‌మహాపాత్రో, పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి తదితరులు పాల్గొన్నారు. గృహహింస, మహిళలపై అసభ్యప్రవర్తన, విద్యార్థులపై లైంగిక వేధింపులు వంటివి జరగకుండా గట్టి చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ జ్యోతింద్ర పండా అన్నారు. సఖీ వన్‌స్టాప్ సెంటర్ వార్షిక వేడుకలు సందర్భంగా ఎస్పీ సతీమణి కేక్ కట్ చేసి మహిళలు, విద్యార్థులకు తినిపించారు. అనంతరం స్థానిక కళాకారులతో సంబల్‌పురి, ఒడిస్సీ నృత్యాలను ప్రదర్శించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డులు అందజేశారు.

సఖీ వన్‌స్టాప్ సెంటర్ వేడుకలకు విచ్చేసిన మహిళలు, విద్యార్థులు




సఖీ వన్‌స్టాప్ సెంటర్ వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీమణి పండా



కేక్ కట్ చేస్తున్న పురపాలక చైర్‌పర్సన్ నిర్మలా శెఠి


సంబల్‌పురి నృత్య ప్రదర్శన

స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించాలి


స్వాతంత్ర్య వేడుకల సన్నాహక సమావేశంలో సబ్‌కలెక్టర్ శౌశ్య రెడ్డి, తదితరులు


సమావేశంలో పాల్గొన్న అధికారులు, పాఠశాలల ప్రతినిధులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ స్థాయిలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరపాలని సబ్ డివిజన్ వేడుకల కమిటీ నిర్ణయించింది. స్థానిక మునిసిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో జయపురం సబ్ కలెక్టర్, మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి అధ్యక్షతన స్వాతంత్ర్య ఉత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. స్వాతంత్ర్య దినాన ఉదయం పట్టణంలో మైక్ ద్వారా రామ్‌ధన్ ప్రచారం చేయాలని, అనంతరం పట్టణంలో గల సాతంత్ర్య యోధుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించాలని సమావేశం నిర్ణయించింది. పట్టణంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో, సంస్థలలో ఉదయం 7.30 నుంచి 8.30 గంటలలోపు జాతీయ పతాకాలు ఎగురవేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఉదయం పేరేడ్ మైదానంలో 9.15 గంటలకు ముఖ్యఅతిథిగా సబ్‌కలెక్టర్ పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తారు.

అనంతం ఉత్కళ బాలాశ్రమలో పిల్లలకు, జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో రోగులకు, జయపురం సబ్ జైలులో ఖైదీలకు పండ్లు, మిఠాయిలు పంచుతారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విద్యార్థులలో ఒడియా, ఆంగ్ల భాషలలో వక్తృత్వ, వ్యాసరచనలు, పోటీలతోపాటు దేశ భక్తి గీతాలు, చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తారు. చిత్రలేఖన తప్ప.. మిగతా పోటీలన్నీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. చిత్ర లేఖన పోటీలు స్థానిక విక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో నిర్వహించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ పోలీసు అధికారి పార్థ జగదీష్ కాశ్యప్, బీడీఓ శక్తి మహాపాత్రో, పోలీసు అధికారులు, పలు ప్రభుత్వ విభాగాల అధికారులు, వివిధ పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ


మోద్రాన్ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న డీఈఓ చిత్తరంజాన్ పాణిగ్రహి

మల్కన్‌గిరి: భువనేశ్వర్ నుంచి ఒడిశా స్కూల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మల్కన్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి చిత్తరంజాన్ పాణిగ్రహి గురువారం మల్కన్‌గిరిలోని పలు పాఠశాలలను తనిఖీ చేశారు. పిల్లల పోషక శక్తిపై ఆరా తీశారు. పిల్లల బరువు చూసి దానికి తగిన కమిటీని ఏర్పాటు చేశారు. పిల్లల్లో పోషక శక్తి పెంచే విధానంపై సూచించారు. ముఖ్యంగా పిల్లలు స్కూల్ బ్యాగ్‌ల బరువు తనిఖీ చేసి అధిక బరువులు ఉంచకూడదని నిబంధనలు జారీ చేశారు .

జాతీయ విద్యా విధానం ఉత్సవంలో ఉమామహేశ్వరి



అవార్డు తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి

ఇచ్ఛాపురం రూరల్: న్యూఢిల్లీలో జరుగుతున్న జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)–2025 ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈదుపురం కంచ్రావార్డు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూరవిల్లి ఉమామహేశ్వరి పాల్గొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈమె గురువారం విద్యార్థులు జి.లావణ్య, టి.శ్రావ్యలతో కలసి న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో జరిగిన వేడుకలో పాల్గొన్నారు. గతంలో రేగిడిలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సమయంలో ఈమె మార్గదర్శకత్వంలో రూపొందించిన 'నేచురల్ హెయిర్ డై' సైన్స్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన రెండు ప్రాజెక్టులలో ఒకటిగా పేరు పొందింది. ప్రాజెక్టును స్వయంగా తిలకించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆమెను అభినందించారు. ఇండియాలో 27 ఉత్తమ ప్రాజెక్టులలో ఉమామహేశ్వరి రూపొందించిన 'నేచురల్ హెయిర్ డై' ప్రాజెక్ట్ ఒకటి కావడం విశేషం. ఈ సందర్భంగా ఆమెకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ యోగేష్ బ్రహ్మంకర్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్నోవేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎలంగోవన్‌లు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.కుమారస్వామి, మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం అభినందించారు.

జెడ్పీలో పలువురికి పదోన్నతులు


నియామకపత్రాలను అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి : జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జిల్లా పరిషత్ బంగ్లాలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆధ్వర్యంలో పదోన్నతులు పొందిన వారికి కొత్తగా నియామక ఉత్తర్వులు అందజేశారు. పలాస మండల కార్యాలయం టైపిస్టు జి.లక్ష్మణరావును టెక్కలి మండల కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా, సీతంపేటలో టైపిస్టుగా పనిచేస్తున్న ఆర్.కిషోర్‌కుమార్‌కు రేగిడిలో సీనియర్ అసిస్టెంట్‌గా, జలుమూరులో టైపిస్టుగా పనిచేస్తున్న జి.ఈశ్వరరావుకు నరసన్నపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా, కంచిలిలో టైపిస్టుగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్ సాహును సోంపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కలిపించారు. అలాగే చాపర జెడ్పీ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.సంపత్‌కుమార్‌ను భామినిలో సీనియర్ అసిస్టెంట్‌గా, పాతపట్నంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జె.మీరాబాయిని కొత్తూరు సీనియర్ అసిస్టెంట్‌గా, శ్రీకూర్మంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.శివరాంను పాలకొండ సీనియర్ అసిస్టెంట్‌గా, మందస జెడ్పీ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.మాలతిని సీతంపేట సీనియర్ అసిస్టెంట్‌గా, స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పివి.మిశ్రాను సంతబొమ్మాళిలో సీనియర్ అసిస్టెంట్‌గా, జిల్లా పరిషత్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.వి.రమణను ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎచ్చెర్ల సబ్ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న బి.గిరిని ఆర్‌డబ్ల్యూఎస్ పలాసలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతులు కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, సీ–సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు రెడ్డిపేట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గ్రామస్తులు గుర్తించారు. ఆమదాలవలస పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి పరిశీలించారు. మృతుడు సుమారు 50 ఏళ్ల వయస్సు కలిగి ఉంటాడని, నాలుగు రోజులుగా పరిసర గ్రామాల్లో భిక్షాటనం చేస్తూ తిరిగేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జిల్లా క్రీడాభారతి నూతన కార్యవర్గం ఏర్పాటు


మాట్లాడుతున్న క్రీడాభారతి నూతన అధ్యక్షుడు చెటికం రాజ్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రీడాభారతి నూతన కార్యవర్గం గురువారం ఏర్పాటైంది. అరసవిల్లి సమీపంలోని చైతన్య విద్యా విహార్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడిగా చెటికం రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బలగ అనంత లక్ష్మదేవ్ (అను), కోశాధికారిగా దండాసి జ్యోతిభాస్కర్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ కర్త, ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలు మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తి ఉన్న ఒక క్రీడను మాత్రమే ఎంచుకని, అందులోనే ఉన్నతంగా సాధన చేసి రాణించాలన్నారు. సెల్‌ఫోన్లకు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి వంగా మహేష్, క్రీడాభారతి సభ్యులు బి.ఖగేశ్వరరావు, మణికంఠ, క్రీడాకారులు పాల్గొన్నారు.

'బంగారం కొంటే రశీదు తప్పనిసరి'


గాంధీ బజారు ఎదురుగా ఉన్న బంగారం షాపులతో తనిఖీలు చేసి సూచనలు చేస్తున్న చిన్నమ్మి

నరసన్నపేట: బంగారం షాపుల్లో బంగారం, ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు విధిగా రశీదులు ఇవ్వాలని తూనికలు, కొలతల అసిస్టెంట్ కంట్రోలర్ పి.చిన్నమ్మి వ్యాపారులకు సూచించారు. అలాగే ఈ రశీదులపై బంగారం ఏ క్యారెట్ అనేది కూడా స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. నరసన్నపేటలో బంగారు షాపులను ఆమె గురువారం తనిఖీ చేశారు. రశీదులు ఇవ్వడం లేదని, ఇచ్చిన రశీదులపై క్యారెట్ల వివరాలు ఉండడం లేదని తెలిపారు. ఇలా ఇవ్వని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే షాపుల్లో వ్యాపారులు వినియోగిస్తున్న తూకాలను పరిశీలించారు. వినియోగిస్తున్న ప్రతి తూకానికీ సీళ్లు వేయించుకోవాలని ఆదేశించారు.

ఉమ్మడి సీనియారిటీ ప్రకారం భర్తీ చేయాలి


ఫ్యాప్టో ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ : పాఠశాల విద్యాశాఖలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ యాజమాన్యాల ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జోన్లలోనూ ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ల ద్వారా ఎంఈఓ–1 పోస్టులు భర్తీ చేయడానికి దాదాపు కసరత్తు చేశారని, ఎంఈఓ–2 పోస్టుల్లో గెజిటెడ్ హెడ్మాస్టర్స్ ఉంటుండగా.. ఎంఈఓ–1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్ ద్వారా భర్తీ చేయడాన్ని ఎస్టీయూ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం దాసరి క్రాంతి భవన్‌లో గురువారం ఎస్టీయూ నాయకులు కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా పరిషత్ యాజమాన్య టీచర్లకు పదోన్నతులలో తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి 72,73, 74 జీవోలు అమలు చేయాల్సి ఉండగా ప్రభుత్వ అధికారులే సమన్యాయాన్ని పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకొని ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రీఅపోర్షన్ పోస్టుల్లో పని చేస్తున్న టీచర్ల జీతాలు చెల్లింపు, బోధనేతర కార్యక్రమాలను రద్దుచేయాలని, పెండింగ్ బకాయిలు విడుదల, పెండింగ్ డీఏల చెల్లింపులు, ఐఆర్ విడుదల, పీఆర్సీ చైర్మన్ నియామకం తదితర సమస్యల పరిష్కారానికి ఈ నెల 2న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఫ్యాప్టో ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రతినిధులు చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, కె.గడ్డెన్నాయుడు,వివిధ మండలశాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరువుల సమస్యలపై కంట్రోల్ రూమ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు ఎరువుల లభ్యత, సరఫరా, ధరలపై ఏవైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులు స్పందించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎరువుల సంబంధిత సమస్యలను కంట్రోల్ రూమ్ నంబర్ 9121863788 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని కోరారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సమర్థంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

2 కిలోమీటర్లు.. 400 మంది పోలీసులు

- నిమ్మాడలో అనధికారిక బందోబస్తు
- కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఇంట్లో వేడుకకు పోలీసుల పహారా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గురువారం ఏ పోలీస్ స్టేషన్ చూసినా నలుగురైదుగురు సిబ్బందే ఉన్నారు. మిగతా వాళ్లంతా పక్క జిల్లాలో బందోబస్తుకో.. లేదంటే నేరస్థలిలో పికెట్‌కో వెళ్లారంటే తప్పులో కాలేసినట్లే. కేంద్ర, రాష్ట్ర మంత్రుల సోదరుని ఇంట్లో జరిగే ఓ వివాహ వేడుకకు పహారా కాశారు. జిల్లా నలుమూలల నుంచి దిగువస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు దాదాపు 400 మంది సిబ్బంది నిమ్మాడలో బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. ఇది ప్రయివేటు కార్యక్రమం కావడంతో అనధికారికంగానే బందోస్తు నిర్వహించినట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. నిమ్మాడ జంక్షన్ నుంచి వేడుక జరిగే గ్రామం లోపలి వరకు 2 కిలోమీటర్ల మేర అడుగడుగునా పోలీసులే కనిపించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉదయం నుంచే బందోబస్తు విధులు పర్యవేక్షించారు. మంత్రుల సోదరుడు సైతం పోలీసు విభాగానికి చెందిన వ్యక్తే కావడంతో ఎక్కడా మాట రాకూడదన్నట్లు దిగువ స్థాయి సిబ్బంది సైతం సుదూర ప్రాంతాల నుంచి ఎండలో మగ్గి మరీ విధులు నిర్వర్తించారు.


● ప్రకృతి 'ఉదయ' స్పందన
ఉదయారుణ కాంతుల్లో ప్రకృతి ఇలా తన హృదయాన్ని ఆవిష్కరించింది. పెంట-మర్రివలస గ్రామాల సమీపంలో పొలాలు, మేఘాలు, కిరణాలు కలగలిపి ఈ ఆహ్లాదకర దృశ్యాలకు పురుడు పోశాయి.
- జి.సిగడాం

క్లుప్తంగా

నాగుపాము అలజడి

• పట్టుకున్న స్నేక్ క్యాచర్



నాగుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ సాయికుమార్, (ఇన్‌సెట్లో) రంధ్రాలు ఏర్పాటు చేసిన డబ్బాలో నాగుపాము

విజయనగరం గంటస్తంభం: స్థానిక బాబామెట్టలోని రెండవ లైన్‌లో ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ అయినంపూడి శ్రీనివాసరావు ఇంటి పరిసరాల్లో ఓ నాగుపాము రెండు రోజులుగా తిరుగుతూ భయాందోళన సృష్టిస్తోంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం మళ్లీ ఆ పాము కనబడడంతో ఫారెస్ట్ అధికారుల సమాచారం మేరకు కలెక్టరేట్ ప్రాంతానికి చెందిన స్నేక్ క్యాచర్ సాయికుమార్ వచ్చి పామును పట్టుకుని ఓ డబ్బాలో వేసి మూతవేసి పాముకు గాలి ఆడడానికి డబ్బాకు రంధ్రాలు ఏర్పాటు చేశాడు. పట్టుకున్న పామును పూల్‌బాగ్ ఫారెస్టులో వదిలిపెట్టనున్నట్లు సాయికుమార్ తెలిపాడు.

3.33 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకట సురేష్

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు సమీపంలో ఉన్న దుర్గ గుడి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి నుంచి 3.33 కేజీల గంజాయిని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకట సురేష్ తెలియజేశారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అశిష్ పండిట్(23) ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి చెన్నైకి తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు జరుగుతున్నాయని గమనించి ఒడిశా నుంచి వస్తున్న వాహనం దిగిపోయి దుర్గగుడి వద్ద అనుమానాస్పదంగా ఉన్నాడు. దీంతో ఆ వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేయగా 3.33 కేజీల గంజాయి బయటపడడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాలుగు క్లినిక్‌ల సీజ్

భామిని: మండలంలోని సింగిడి, గురండిలలో ఎటువంటి అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నడుపుతున్న నాలుగు క్లినిక్‌లను సీజ్ చేసినట్లు బత్తిలి, భామిని వైద్యాధికారులు పసుపులేటి సోయల్, కొండపల్లి రవీంద్రలు గురువారం తెలిపారు. కలెక్టర్, డీఎంహెచ్‌ఓల ఆదేశాల మేరకు భామిని తహసీల్దార్ శివన్నారాయణ, బత్తిలి ఎస్సై జి.అప్పారావులతో కలిసి సింగిడి, గురండి గ్రామాల్లో దాడులు చేసినట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా నడుపుతున్న క్లినిక్‌లను సందర్శించి సీజ్ చేసి నిర్వాహకులకు నోటీసులు అందజేసినట్లు చెప్పారు. క్లినిక్‌లలో వాడుతున్న మందులు, సర్జికల్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బృందంలో డీటీ రమేష్ కుమార్, ఎంఆర్‌ఐ మణి ప్రభాకర్, వీఆర్‌ఓ ఉన్నారు.

గిరిసీమల్లో కార్డెన్ సెర్చ్

శృంగవరపుకోట: తూరుపు తెల్లారక ముందే ఎస్.కోటలో పోలీసు బలగాలు గురువారం ప్రత్యక్షమయ్యాయి. అటు జిందాల్ వ్యతిరేక నిరసనలు.. ఇటు ఎస్.కోటలో ఆక్రమణల తొలగింపులున్న నేపథ్యంలో పోలీసుల రాకతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొద్దిసేపటికి పోలీసులు కార్డెన్ సెర్చ్‌కు వచ్చినట్లు తెలిసింది. డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్.కోట, కొత్తవలస, విజయనగరం రూరల్ సీఐలు నారాయణమూర్తి, షణ్ముఖరావు, బి.లక్ష్మణరావు, 16 మంది ఎస్సైలు, 85 మంది పోలీస్ కానిస్టేబుళ్లు గిరిజన గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల పల్లపుదుంగాడలో ఒక వ్యక్తి తన పినతండ్రిని నాటుతుపాకితో హత్య చేసిన నేపథ్యంతో ఇంటింటినీ జల్లెడ పట్టి నాటు తుపాకులు, ఆయుధాలపై ఆరా తీశారు. దారపర్తి పంచాయతీ పరిధిలోని మున్నపురాయి, రాయపాలెం, చప్పవాని గెడ్డ, పల్లపుదుంగాడ, రంగవలస, పాత శనగపాడు, కొత్త శనగపాడు, దబ్బగుంట.. మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టింపాడు, గూనపాడు, తదితర గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నా.. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. సెర్చ్ ఆపరేషన్‌లో విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్, తెర్లాం, పూసపాటిరేగ, సంతకవిటి, వల్లంపూడి, బొండపల్లి స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.


డిజిటల్ బోర్డుల పేరిట దోపిడీ

• తప్పుల తడకగా ఇంటి నంబర్ల నమోదు
• ఒక్కో బోర్డుకు రూ.50 చొప్పున వసూలు

కాదేదీ దోపిడీకి అనర్హం అన్నట్లు తయారైంది కూటమి ప్రభుత్వం తీరు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో శ్రద్ధ తీసుకోవడం లేదు కానీ..ప్రజలను ఏదో రకంగా దోచుకోవడమే లక్ష్యంగా చేసుకుందని చెప్పడానికి డిజిటల్ బోర్డుల ఏర్పాటు పేరుతో చేస్తున్న కలెక్షన్లు ఉదాహరణగా నిలుస్తున్నాయి. -వీరఘట్టం



జిల్లా పంచాయతీ అధికారి ఇచ్చారంటూ చూపిస్తున్న ఉత్తర్వుల కాపీ



ఈ ఫొటో చూశారా? వీరఘట్టంలోని తెలగ వీధిలో ఓఇంటికి 5-18 నంబర్ వేస్తూ బోర్డు అతికించారు.అయితే ఈ ఇంటి నంబర్ 6-68 అని పంచాయతీ రికార్డులో ఉంది.తప్పులు తప్పులుగా బోర్డులు అతికించడంపై ప్రజలు విస్తుపోతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయని వారు చెబుతుండడంతో ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తూ వారడిగిన రూ.50 ఇచ్చేస్తున్నామని ప్రజలు చెబుతున్నారు.

ఈ ఫొటో చూశారా?

చిన్న ఇనుప రేకును తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మన్యం జిల్లా, డిజిటల్ ఇంటి చిరునామా అనే అక్షరాలు ఉన్న ప్రతి ఇంటి గుమ్మానికి అతికిస్తున్నారు. ఇలా రేకు బోర్డు పెట్టినందుకు ప్రతి ఇంటి నుంచి రూ.50 వసూలు చేస్తున్నారు. వీరఘట్టం మండలంలో ఇంతవరకు సుమారు 15 వేల ఇళ్లకు ఇటువంటి బోర్డులు పెట్టి గృహవాసుల నుంచి రూ.7.50 లక్షలను వసూలు చేశారు. ఇదే మాదిరి జిల్లాలో ఉన్న 4.50 లక్షల గృహాలకు ఇటువంటి బోర్డులు అమర్చి ఏకంగా రూ.2.25 కోట్లు కొల్లగొట్టేందుకు రంగం సిద్ధం చేశారు. డిజిటల్ బోర్డు పేరుతో ఇంటికి అమర్చుతున్న ఈ రేకు కనీసం రూ.5 కూడా ఉండదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రతి ఇంటికి డిజిటల్ ఇంటి చిరునామా బోర్డుల ఏర్పాటు పేరుతో ప్రజల నుంచి దోపిడీ జరుగుతోంది. ఈ దోపిడీపై జిల్లా ప్రజలు విస్తుపోతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పంచాయతీ అధికారి ఈ ఏడాది మార్చి 28న ఉత్తర్వులు ఇచ్చినట్లు బోర్డులు అమర్చడానికి వచ్చినవారు చెబుతున్నారు. అధికారులు ఇచ్చిన జీవో కాపీ చూపిస్తున్నారు. అయితే ఈ డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు తమకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు చెబుతున్నారు.అభ్యంతరాలుంటే బోర్డులు బిగించవద్దని, .పేద, మధ్య తరగతి వారికి ఉచితంగా బోర్డులు ఏర్పాటు చేయాలని ఈ జీవో కాపీలో ఉంది.అయితే అవేవీ కాకుండా ప్రతి ఇంటికి బోర్డు బిగించి డబ్బులు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని స్థానికులు అంటున్నారు.అయితే ఈ బోర్డుల ఏర్పాటుకు తమకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు చెబుతున్నారే తప్ప ఈ నిలువు దోపిడీని అడ్డుకోకపోవడంపై ప్రజల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇంటింటికీ ఏర్పాటు చేస్తున్న ఇంటి నంబర్లు తప్పుల తడకగా ఉన్నాయి.

ఫోన్ కాల్స్ ఒత్తిడితో..

అమరావతి నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ ఒత్తిడితో ఇంటి చిరునామా బోర్డుల ఏర్పాటుకు జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీలకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఈ ముఠా నేరుగా గ్రామాల్లో ఇంటి చిరునామా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.పేరుకు వీరు ఒక్కో ఇంటి నుంచి కలెక్షన్ చేస్తున్నది రూ.50 గా కనిపిస్తున్నప్పటికీ జిల్లా వ్యాప్తంగా చూస్తే రూ.2.25 కోట్లు దోచుకునే కుట్ర జరుగుతోందని జిల్లా ప్రజలు మండిపడుతున్నారు. కొంత మంది మాత్రం ఈ బోర్డులు వద్దని తిరస్కరిస్తున్నప్పటికీ వారితో వాదిస్తూ ఈ బోర్డులు అందరి ఇళ్లకు వేయాలని మా వద్ద ఆర్డర్ కాపీ ఉందని బలవంతంగా ఈ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

మాకు సంబంధం లేదు

జిల్లాలో చాలా చోట్ల ఇంటికి డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.అయితే ఆ బోర్డుల ఏర్పాటుకు మాకు ఎటువంటి సంబంధం లేదు. నచ్చకపోతే ఎవరూ ఆ బోర్డులు ఏర్పాటు చేసుకోవద్దు. ఎక్కడైనా బోర్డులు ఏర్పాటు చేయాలనుకుంటే గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి, పంచాయతీ అంగీకారంతో పంచాయతీ రికార్డుల ప్రకారం ఇంటి నంబర్లు వేసి బోర్డులు ఏర్పాటు చేయవచ్చు. ఇష్టం లేని వారు బోర్డులు వద్దని చెప్పండి.

– పి.కొండలరావు, డీపీఓ, పార్వతీపురం మన్యం జిల్లా

నేర నియంత్రణే లక్ష్యంగా 'కార్డన్ సెర్చ్'

విజయనగరం క్రైమ్: నేరాలను నియంత్రించి, ప్రజలకు భద్రత, రక్షణ కల్పించడంలో భాగంగా ఎస్.కోట పోలీస్ స్టేషన్ పరిధిలోని దారపర్తి, బొడ్డవర పంచాయతీల్లో గల గిరిజన గ్రామాల్లో 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ గురువారం నిర్వహించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎటువంటి సారా, గంజాయి లభించలేదన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్, మాట్లాడుతూ నేరాలను నియంత్రించడమే లక్ష్యంగా ఎస్.కోట పోలీస్ స్టేషన్ పరిధిలోని దారపర్తి పంచాయతీ గిరిజన గ్రామాలైన మునుపురాయి, రాయపాలెం, చప్పనిగెడ్డ, పల్లపు దుంగాడ, రంగవలస, పాతశెనగపాడు, కొత్త సెనగపాడు, దబ్బగుంట గ్రామాల్లోను మూల బొడ్డవర పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం, బొడ్డపాడు, చిలకపాడు, చిట్టెంపాడు, గుణపాడు గ్రామాల్లో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడిన పోలీసులు 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారన్నారు. ఈ బృందాలకు ఎస్.కోట సీఐ వి.నారాయణ మూర్తి, కొత్తవలస సీఐ షణ్ముఖరావు, విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు నాయకత్వం వహించారన్నారు. ఈ ఆపరేషన్‌లో 16మంది ఎస్సైలు, 85 మంది పోలీసు సిబ్బంది బృందాలుగా ఏర్పడి, వారికి నిర్దేశించిన గిరిజన గ్రామానికి చేరుకుని, ఇండ్లు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారని తెలిపారు. అనుమానిత వ్యక్తులు పారిపోయేందుకు అవకాశం ఉన్న మార్గాలను ముందుగా గుర్తించి, ఆయా మార్గాలను పోలీసు బృందాలు ముందుగానే దిగ్బంధం చేసినట్లు చెప్పారు.



కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బంది

ముగిసిన హ్యాండ్‌బాల్ మీట్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ జవహర్‌నవోదయ విద్యాలయలో మూడురోజులుగా నిర్వహిస్తున్న హైదరాబాద్ రీజియన్‌స్థాయి హ్యాండ్‌బాల్ మీట్ 2025–26 గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ మీట్‌కు దక్షిణ భారతదేశంలో ఎనిమిది క్లస్టర్లు యానాం, అదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకుళం, హవేరి, హాసన్, కలబుర్గిల నుంచి క్రీడాకారులు వచ్చారు. వారంతా మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాజారావు నేతృత్వంలో నిర్వహించిన పోటీల్లో యానాం క్లస్టర్ అత్యుత్తమ ప్రదర్శనతో 26బహుమతులు సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. గురువారం సాయంత్రం ముగింపు వేడుకల్లో ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీలను దిగ్విజయంగా పూర్తిచేసిన రిఫరీలు, కోచ్‌లు, ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు, క్రీడాకారులకు ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.

స్కూల్ ఆటో బోల్తా

• ఐదుగురు విద్యార్థులకు గాయాలు
• మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్

కొత్తవలస: మండలంలోని విజయనగరం–కొత్తవలస రోడ్డులో అర్థాన్న పాలెం జంక్షన్ సమీపంలో గురువారం స్కూల్ ఆటో బోల్తాపడిన ఘటనలో ఐదుగురు విద్యార్థులు గాయాల పాలయ్యారు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మంగళపాలెం, రాజాథియేటర్ సమీపంలోని వారిని రోజూ ఆటోలో స్కూల్‌కు తల్లిదండ్రులు పంపిస్తూ ఉంటారు. అయితే గురువారం విద్యార్థులను యథావిధిగా స్కూల్ వద్ద డ్రైవర్ దింపేశాడు. మళ్లీ స్కూల్ వదిలే సమయంలో తిరిగి పిల్లలను ఆటో ఎక్కించుకుని వస్తుండగా అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో జరిగిన ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు పిల్లల్లో 7వ తరగతి చదువుతున్న కె.మహేంద్ర కాలికి తీవ్ర గాయమైంది. అలాగే 9వ తరగతి చదువుతున్న డి.నిరిషా నడుముకు గాయమైంది. స్థానికుల సహాయంతో గాయపడిన చిన్నారులను కొత్తవలసలో గల ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.కాగా ఆటో డ్రైవర్ పూటుగా మద్యం తాగి ఉన్నాడని, ఆటోపై ఫీట్‌లు చేశాడని అదే సమయంలో ఆటో బోల్తా పడిందని విద్యార్థులు తెలిపారు.ప్రమాద వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రి వద్దకు చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహేంద్ర



నడుముకు గాయం కావడంతో నడవలేని స్థితిలో నిరిషా

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

• జిల్లా కన్వీనర్ ఎస్ రూపావతి

పార్వతీపురం రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో మిగులు సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ ఎస్. రూపావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్య, వసతి సౌకర్యాలతో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఆసక్తిగల విద్యార్థులు ఆధార్ కార్డుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్స్‌తో తమకు కావాలిసిన ప్రాంతంలో ఆయా పాఠశాలలను, కళాశాలలను నేరుగా వెళ్లి సంప్రదించాలని కోరారు. బాలురుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో కొప్పెర్ల, బాడంగి, పాలకొండ, సాలూరు, జోగింపేటలో అదేవిధంగా బాలికలకు సంబంధించి చీపురుపల్లి, నెల్లిమర్ల, వేపాడ, వీఎం పేట, వంగర, గరుగుబిల్లి, కొమరాడ, భామిని పాఠశాలల్లో అలాగే కళాశాలల్లో ఉన్న ఖాళీల మేరకు సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆస్తికోసమే హత్య

• డీఎస్పీ శ్రీనివాస రావు



ఎస్‌కోట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని పల్లపుదుంగాడలో ఇటీవల సంభవించిన హత్య కేవలం ఆస్తి కోసమే జరిగినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్యకేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తన తండ్రి సీదిరి రాములును తన పెదనాన్న కొడుకైన నాగులు నాటుతుపాకీతో 28వ తేదీ సాయంత్రం కాల్చి చంపినట్లు హతుడి కుమార్తె పల్లపుదుంగాడకు చెందిన బడ్నాన నాగమణి ఈనెల 29న మధ్యాహ్నం ఫిర్యాదు చేసిందని చెప్పారు. దీంతో ఎస్‌కోట సీఐ నారాయణమూర్తి, ఎస్సై చంద్రశేఖర్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. మృతుడు సీదిరి రాములుకు నాగులుకు మధ్య ఆస్తి వివాదాలున్నాయి. రాములుకు మగపిల్లలు లేనందున చిట్టంపాడులో రెండెకరాల పొలం తనకు ఇచ్చేయాలని నాగులు కొంత కాలంగా పినతండ్రిని అడుగుతున్నాడు. ఆ భయంతో రాములు మూడేళ్లుగా పల్లపుదుంగాడలో కుమార్తె వద్ద ఉంటున్నాడు. 28న సాయంత్రం పల్లపుదుంగాడ పొలాల్లో రాములు పని చేస్తుండగా నాగులు తన వద్ద ఉన్న తపంచాతో పినతండ్రి రాములుపై కాల్పులు జరిపాడు. దీంతో రాములు పొలంలోనే చనిపోయాడని డీఎస్పీ చెప్పారు. నిందితుడు నాగులు కోసం గాలిస్తుండగా సీఐకి అందిన సమాచారంతో గురువారం ఉదయం ఐతన్నపాలెం జంక్షన్‌లో అనుమానాస్పదంగా నడుచుకుంటూ వస్తుండగా అదుపులోకి తీసుకున్నారన్నారు. నిందితుడిని విచారణ చేసి బొడ్డవర రైల్వేస్టేషన్ సమీపంలో తుప్పల్లో దాచిన తపంచా, దుస్తులు పోలీసులు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామని వివరించారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్.కోట సీఐ నారాయణమూర్తి, ఎస్సై చంద్రశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని కురుపాం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ(తెలుగు) ఉపాధ్యాయుడి పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బహదూర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీతోపాటు బీఈడీ పూర్తిచేసి ఉండి, టెట్‌లో అర్హత సాధించినవారు ఈనెల 9లోగా హెచ్‌టీటీపీఎస్://ఇఎంఆర్‌ఎస్.ట్రైబల్.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 11న ఇంటర్వ్యూ ఉంటుందని, మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ 6200335685 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

• జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి



నర్సిపురం వద్ద వాహనాల తనిఖీ చేపట్టిన రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులు

పార్వతీపురం రూరల్: వాహన దారులు కచ్చితంగా రహదారి భద్రత నియమాలు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ మేరకు రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా సహాయ రవాణా శాఖాధికారులు బి.కాశీరాం నాయక్, స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గతో కలిసి మండలంలోని నర్సిపురం గ్రామం సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వెళ్తూ భద్రత నియమాలను అతిక్రమించిన 11 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే మూడు వాహనాలను, 12 ఆటోలతో పాటు ఒక లైట్ గూడ్స్ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా రూ.30వేలు జరిమానాను వాహనాలకు విధించారు. అలాగే రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై వాహన దారులకు, పాదచారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా నిబంధనలు పాటిస్తూ ఐఎస్‌ఐ మార్క్ ఉన్న హెల్మెట్ విధిగా ధరించాలని జిల్లా రవాణా శాఖాధికారి దుర్గాప్రసాద్ రెడ్డి సూచించారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణం చేయరాదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో రవాణాశాఖ కానిస్టేబుల్స్, హోం గార్డులు తదితర సిబ్బంది ఉన్నారు.

ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా

• ఒకరి మృతి
• మరో ఆరుగురికి గాయాలు



కొండగొర్రి ఎల్లంగో మృతదేహం



లోయలో పడి నుజ్జునుజ్జయిన ఆటో



బంద్రిసింగి ఘాట్ రోడ్డు వద్ద గిరిజనులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు, ఎస్సై అప్పారావు

భామిని: మండలంలోని బంద్రసింగి ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుపాం మండలం ఆవిరి గ్రామానికి చెందిన కొండగొర్రి ఎల్లంగో(60) ప్రమాద స్థలంలోనే ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఆవిరి గిరిజన గ్రామం నుంచి భామిని వారపు సంతకు పశువుల కొనుగోలుకు ఆటోలో వస్తున్న తరుణంలో ప్రమాదం జరిగింది. బంద్రసింగి ఘాట్ రోడ్డులో అతివేగంగా వస్తున్న ఆటో బోల్తా కొట్టి లోయలోకి పడిపోయి నుజ్జునుజ్జయింది. ఈ నేపథ్యంలో అటోలో ప్రయాణిస్తున్న కొండగొర్రి ఎల్లంగో(60)తో మృతి చెందడంతో పాటు మరో ఆరుగురికి గాయాలయ్యాయి. కొండగొర్రి గంగారావు, కొండగొర్రి నగేష్, కొండగొర్రి సుమంతోలు తీవ్ర గాయాల పాలు కావడంతో 108 అంబులెన్స్‌లో తరలించి భామిని పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం తరువాత సీతంపేట ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆటో డ్రైవర్ బిడ్డిక కోరాతో పాటు బిడ్డిక కర్ణలు గాయాల పాలయ్యారు. సమాచారం మేరకు ప్రమాద స్థలాన్ని పాలకొండ డీఎస్పీ రాంబాబు, బత్తిలి ఎస్సై జి.అప్పారావులు సందర్శించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. ఎల్లంగో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తివ్వాకొండల్లోని ఘాట్ రోడ్లలో రక్షణగా రాతి కట్టలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజనులు డీఎస్పీ రాంబాబుకు ఫిర్యాదు చేశారు.

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్

పార్వతీపురం టౌన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ, మధ్యంతర భృతి, కారుణ్య నియామకాలు, సీపీఎస్ రద్దు వంటివి అమలు చేయాలని ఆగస్టు 2న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు బోధన తప్ప ఇతర కార్యక్రమాలు లేకుండా చేయాలి. పి–4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులకు నిర్బంధం చేయరాదు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలి. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యాశాఖలో ఉన్న అసంబద్ధతను తొలగించాలి. 72, 73, 74 జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌లలో వెంటనే ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి, యథాతథంగా కొనసాగించాలని కోరారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి. 30% మధ్యంతర భృతిని ప్రకటించాలి. ఈ సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ ఎస్.చిరంజీవి, కో చైర్మన్లు కె.నరహరి, మనోజ్ కుమార్, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విశ్రాంత బ్యాంక్ మేనేజర్

• అరుదైన కరెన్సీ నోట్లు సేకరించి రికార్డు



ఒకే సారి మూడు లిమ్కా రికార్డులను సాధించిన విశ్రాంత బ్యాంక్ మేనేజర్ రాజు



లక్కవరపుకోట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఎస్ఎన్ రాజుకు అరుదైన కరెన్సీ నోట్లు సేకరించడం అలవాటు. అరుదైన కరెన్సీ నోట్లు సేకరించినందుకు గాను 2025వ సంవత్సరానికి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో ఆయన స్థానం సాధించారు. అంతేకాకుండా ఒకేసారి ఆయన మూడు లిమ్కా రికార్డులు సాధించడం విశేషం. ప్రతి కరెన్సీ నోటుపై ఒక రకమైన సిరీస్ నంబర్ కలిగిన నోట్లు సుమారు 12 వందలు సేకరించినందుకు ఒక రికార్డు, అలాగే కరెన్సీ ముద్ర సమయంలో పొరపాటు జరిగితే ఆ నోటుకు బదులు వేరే నోటు ముద్రిస్తారు.ఆ విధంగా ముద్రించిన నోట్‌పై స్టార్ గుర్తు పెడతారు. అలాంటి స్టార్ నోట్లు సుమారు 11వందల నోట్లు సేకరించి మరో రికార్డును నమోదు చేశారు. ఇంకా కరెన్సీ నోట్‌పై సీరియల్ నంబర్‌లు ఆరు డిజిట్స్ మాత్రమే ఉంటాయి. ఏడో డిజిట్ ఉన్న నోట్లు చాలా అరుదుగా వస్తాయి. అలా ఏడు డిజిట్స్ ఉన్న నోట్లను సేకరించి మూడో రికార్డు సాధించారు. మొత్తంగా ఒకే సారి మూడు లిమ్కా రికార్డులను సాధించిన ఆయనను పలువురు అభినందించారు.







సేకరించిన స్టార్ నోట్‌లు, ఒకే సిరీస్ నంబర్ గల నోట్లు, 7 డిజిట్స్ గల నోట్లు